# శ్రీకాంత్ కుమార్తె సినిమాతో

# రామజోగయ్య శాస్త్రి తనయుడి ఎంట్రీ



ప్రముఖ నటుడు శ్రీకాంత్ కుమార్తె మేధ 'మైత్రి ఇన్ లవ్'తో వెండితెరకు పరిచయమవుతున్న సంగతి తెలిసిందే. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఇటీవలే ముహూర్తం జరుపుకొంది. అయితే ఈ సినిమాతో మేధ మాత్రమే కాదు.. మరో వారసుడు కూడా సినీ రంగ ప్రవేశం చేస్తుండటం విశేషం.

ప్రముఖ గీత రచయిత రామజోగయ్య శాస్త్రి కుమారుడు సాయి హర్ష ఈ చిత్రంతో సంగీత దర్శకుడిగా పరిచయమవుతున్నారు. ఈ విషయాన్ని రామజోగయ్య శాస్త్రి 'ఎక్స్' వేదికగా పంచుకున్నారు. "ప్రముఖ నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ అందిస్తున్న చిత్రంతో సాయి హర్ష తన ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నాడు. వినయం, అణకువతో మెలిగే మా అబ్బాయికి సంగీతమంటే ఎంతో మక్కువ. అతనికి మీ ఆశీర్వాదాలు కావాలి" అని పేర్కొన్నారు.

# హారర్ కామెడీ చిత్రంతో రాబోతున్న జై..



కోలీవుడ్ యంగ్ హీరో జై సంపత్ ఒక సరికొత్త ప్రయోగంతో ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటివరకు ఎక్కువగా లవ్ స్టోరీలు, రొమాంటిక్ చిత్రాలతో మెప్పించిన ఆయన, ఇప్పుడు పూర్తిగా ట్రాక్ మార్చి ఒక భిన్నమైన హారర్ కామెడీ చిత్రాన్ని ఎంచుకున్నారు. తాజాగా, చిత్ర యూనిట్ అధికారిక ప్రకటన చేసింది. త్యాగరాజ టాకీస్ బ్యానర్‌పై వస్తున్న 'ప్రొడక్షన్ నం. 1' ఈ సినిమా పూజా కార్యక్రమాలు అత్యంత ఘనంగా జరిగాయి. ఎలాంటి హడావుడి లేకుండా ప్రారంభమైన ఈ చిత్రంతో శివ ప్రసన్న దర్శకుడిగా ఇండస్ట్రీకి పరిచయం అవుతున్నారు. అలాగే ఈ సినిమాను ఏ.ఎం. ప్రభాకరన్ నిర్మిస్తున్నారు. ఈ చిత్రంలో జై సరసన డెల్నా డేవిస్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. సినిమాకు సంబంధించి మేకర్స్ సోషల్ మీడియాలో స్పందిస్తూ.. ఉత్కంఠభరితమైన ప్రయాణం మొదలవుతుందంటూ రాసుకొచ్చారు. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన షూటింగ్ పనులు కూడా వేగంగా జరుగుతున్నాయి. తమిళనాడులోని ప్రముఖ ప్రాంతమైన తెన్‌కాశిలో చిత్ర యూనిట్ షూటింగ్‌ను అధికారికంగా ప్రారంభించింది. ఎంతో ఉత్కంఠభరితంగా సాగే ఈ కొత్త ప్రయాణం ప్రేక్షకులకు మంచి నవ్వులతో పాటు సరికొత్త హారర్ అనుభూతిని పంచుతుందని చిత్ర బృందం నమ్ముతోంది. విభిన్నమైన కథాంశంతో వస్తున్న ఈ సినిమాపై ఇండస్ట్రీలోనూ మంచి అంచనాలు నెలకొన్నాయి.

# విజ్జూ.. నేను నీకు ఫ్యాన్ గర్ల్‌ను: రష్మిక



విజయ్ దేవరకొండ కథానాయకుడిగా రాహుల్ సాంకృత్యాన్ దర్శకత్వంలో రూపొందిన పీరియాడిక్ యాక్షన్ డ్రామా 'రణబాలి'. రష్మిక కథానాయిక. దసరా కానుకగా అక్టోబరు 16న ఈ మూవీ విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం రాత్రి ఈ చిత్ర ప్రిరిలీజ్ వేడుక నిర్వహించారు. రష్మిక మాట్లాడుతూ.. "ఇన్‌స్టా ఓపెన్ చేస్తే జయమ్మ, రణబాలి గెటప్పుల్లో కొన్ని వేల రీల్స్ కనిపిస్తున్నాయి. ఏమి అభిమానం చూపిస్తున్నారబ్బా..! మీ అభిమానం చూస్తుంటే ఎంతో ముద్దుగా ఉంది. అందుకు థ్యాంక్స్ చెబుతున్నా. ఈ సినిమా సెట్‌కు వెళ్లాలంటే భయమేసేది. ఎందుకంటే అందరూ అంత సీరియస్‌గా పనిచేస్తుండేవారు. రణబాలి పాత్రలో విజయ్ మీసాలు దువ్వుతూ యాక్ట్ చేస్తుంటే, భయంగా అనిపించేది.యూనిట్ మొత్తం ఈ సినిమాపై ఎంత ప్యాషన్‌తో పనిచేస్తున్నారో అప్పుడు అర్థమైంది. నేను తొలి ప్రేక్షకురాలిగా చెబుతున్నా. ఈ సినిమా మిమ్మల్ని ఓ కొత్త ప్రపంచంలోకి తీసుకెళ్తుంది. నాకు ఏ సినిమా వచ్చినా అది నాకు రాసిపెట్టి ఉందని భావిస్తా. ఈ సినిమా అవకాశం వచ్చినప్పుడు నేను ఎంతో రుణపడి ఉన్నట్లు అనిపించింది. ఈ సినిమాలో విజయ్‌కి, నాకు మధ్య వచ్చే సన్నివేశాలు కొత్తగా ఉంటాయి. జయమ్మ అనేది తన తల్లి పేరని రాహుల్ చెప్పారు. అక్కడే మనసు కరిగిపోయింది. జయమ్మ పాత్ర ఎప్పటికీ గుర్తుండిపోతుంది. విజయ్‌తో పెళ్లి అయినట్లు అనిపించలేదు. ఫ్యాన్ గర్ల్ మూమెంట్‌లా ఉంది. విజ్జూ.. నీ వర్క్‌కు నేను ఫ్యాన్‌ను. రణబాలితో నీ శ్రమ గురించి అందరికీ తెలుస్తుంది" అని అన్నారు.



# అది నేనేనా అనిపిస్తుంది

### ఏఐ మార్ఫింగ్ ఫొటోలపై నటి శ్రియ

ఏఐ సాంకేతికతను దుర్వినియోగం చేస్తూ మహిళల అసభ్యకర ఫొటోలు, వీడియోలు సృష్టించడం ఇటీవల పెరిగిపోతోంది. పలువురు సినీ నటులు ఈ డీప్‌ఫేక్ బారిన పడిన సంగతి తెలిసిందే. ఈ డిజిటల్ వేధింపులపై నటి శ్రియ ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో తాను కూడా ఇలాంటి మార్ఫింగ్ ఫొటోల బారిన పడ్డానని తెలిపారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో ఆమె మాట్లాడుతూ ఈ విషయాలను వెల్లడించారు. "కొన్నిసార్లు ఆ ఫొటోలు చూస్తే అసలు అక్కడ ఉన్నది నేనేనా అనిపిస్తుంది. శరీరాకృతిని అసహ్యంగా మారుస్తారు. మనం వేసుకున్న దుస్తులను తీసేసి చూపిస్తారు. కొందరు దీన్ని చూసి నవ్వుకోవచ్చు. కానీ, ఇది ఎంతో బాధ కలిగిస్తుంది. ఏఐ సాంకేతికతతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నప్పటికీ.. బాధ్యత లేకుండా వాడితే అది తీవ్రమైన ప్రమాదాలకు దారితీస్తుంది. ఇలాంటి సాంకేతిక సవాళ్లను ఎలా ఎదుర్కోవాలో మనం నేర్చుకోవాలి" అని శ్రియ పేర్కొన్నారు. సినీ రంగంలో తన 25 ఏళ్ల ప్రయాణాన్ని గుర్తు చేసుకుంటూ శ్రియ ఆసక్తికర విశేషాలు పంచుకున్నారు. "2001లో 'ఇష్టం' సినిమాతో నా ప్రయాణం మొదలైంది. నా మొదటి మూడు సినిమాలకు అసలు కారవాన్లే లేవు. అందరం కలిసి చెట్టు కింద కూర్చుని భోజనాలు చేసేవాళ్లం. జీవితం, పుస్తకాలు, సంగీతం గురించి ఎన్నో కబుర్లు మాట్లాడుకునేవాళ్లం. టేప్ రికార్డర్ తెచ్చి అందరం కలిసి పాటలు వినేవాళ్లం. ఇప్పుడు పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ప్రతి ఒక్కరూ ఇయర్‌ఫోన్లు పెట్టుకుని తమ సొంత లోకంలో ఉంటున్నారు. కథలు చెప్పే విధానం కూడా మారింది" అని ఆమె తెలిపారు.

సినిమా నిర్మాణంలో మహిళల ప్రాధాన్యంపై ఆమె మాట్లాడుతూ.. "స్క్రీన్ ముందు కంటే స్క్రీన్ వెనుక ముఖ్యమైన నిర్ణయాలు తీసుకునే స్థానాల్లో మహిళలు ఉండాలి. కథల ఎంపిక, పెట్టుబడుల విషయంలో మహిళల భాగస్వామ్యం పెరగాలి. కేవలం మహిళా ప్రాధాన్య చిత్రాలు తీసినంత మాత్రాన సరిపోదు. ఆ సినిమా వెనుక పనిచేసే వాళ్లంతా పురుషులే అయితే, దాన్ని మహిళా చిత్రంగా ఎలా భావిస్తాం? పరిశ్రమలో మార్పు ఇప్పుడిప్పుడే మొదలైంది. ఇంకా ఎంతో దూరం ప్రయాణించాలి" అని ఆమె అన్నారు. సినిమాల విషయానికొస్తే, ఆమె ఇటీవల నటించిన 'దృశ్యం: ది కన్‌క్లూజన్' లో అక్టోబరు 2న ప్రేక్షకుల ముందుకు వచ్చింది.



# నా రిటైర్మెంట్‌పై ప్రజలకి ఎందుకంత ఆసక్తి?: అమితాబ్

బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్ వయసు ప్రస్తుతం 84 ఏళ్లు. అయితే పుట్టినరోజు వేడుకలు చేసుకోవడం ఆయనకు ఏమాత్రం ఇష్టం ఉండదట. తనకు రిటైర్ అయ్యే ఆలోచన కూడా లేదని బిగ్‌బీ తాజాగా స్పష్టం చేశారు. చావు అంచుల వరకు వెళ్లి తిరిగొచ్చానని, దైవానుగ్రహం వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో మాట్లాడిన అమితాబ్.. పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు."పుట్టినరోజు కూడా సాధారణ రోజే. పుట్టినరోజు నాడు మా కుటుంబంలో ఒక సంప్రదాయం ఉండేది. మా నాన్న హరివంశ్ రాయ్ బచ్చన్ ఆరోజు ఒక కవిత చదివి వినిపించేవారు. 1982లో 'కూలీ' సెట్‌లో నేను తీవ్రంగా గాయపడ్డా. చావు చివరి వరకు వెళ్లి ప్రాణాలతో బయటపడ్డాను. ఆ తర్వాత వచ్చిన నా బర్త్‌డే రోజు కవిత చదువుతూ మా నాన్న ఏడ్చారు. ఆయన అలా ఏడవడం చూడటం అదే తొలిసారి" అని అమితాబ్ గుర్తుచేసుకున్నారు. 1984లో రాజకీయాల్లోకి వెళ్లినప్పుడు సినిమాలకు బిగ్‌బీ కాస్త బ్రేక్ ఇచ్చారు. ఆ తర్వాత తిరిగి సినిమాల్లోకి వచ్చాక రిటైర్మెంట్ గురించి ఆయన ఎప్పుడూ ఆలోచించలేదు. "నేను ఇంకా పనిచేస్తుండటం నా అదృష్టం. నా ఉత్సాహానికి తగ్గట్లుగా శరీరం సహకరిస్తోంది. నేనెందుకు పని మానేయాలి?నా రిటైర్మెంట్‌పై ప్రజలకి ఎందుకంత ఆసక్తి?" అని అమితాబ్ ప్రశ్నించారు. "1990లలో ఏబీసీఎల్ కంపెనీ దెబ్బతినడంతో నేను ఆర్థికంగా చాలా ఇబ్బందులు పడ్డా. ఇప్పుడు 2026 హురున్ ఇండియా రిచ్ లిస్ట్ ప్రకారం నా మొత్తం ఆస్తి రూ.4,000 కోట్లు. అయినా నాకు ఆర్థిక విషయాలు, లెక్కలు పెద్దగా తెలియవు" అని ఆయన తెలిపారు.డైరెక్షన్ చేసే ఆలోచన ఉందా అని అడగ్గా.. "అది నా కలలో కూడా లేదు. ఆ క్రాఫ్ట్ నాకు సరిగా తెలియదు. నా దర్శకులకు కొన్ని సలహాలు ఇస్తుంటాను. చాలాసార్లు వాళ్లు నా ఐడియాలను తిరస్కరిస్తారు. సంతోషకరమైన విషయం ఏంటంటే.. అలా రిజెక్ట్ చేసిన సినిమాలే సూపర్ హిట్ అయ్యాయి. నేను ఎప్పుడూ దర్శకుడిని ఇబ్బంది పెట్టలేదు. సినిమాకు దర్శకుడే కెప్టెన్" అని బదులిచ్చారు. జీవితంలో తీరని కోరికలు ఏమైనా ఉన్నాయా అన్న ప్రశ్నకుక సమాధానంగా పియానో వాయించడం నేర్చుకోవాలని ఉందన్నారు. దిగ్గజ దర్శకుడు గురుదత్‌తో కలిసి పనిచేయలేకపోయానని, కుటుంబంతో మరింత సమయం గడపలేకపోయానని ఆవేదన వ్యక్తం చేశారు. అమితాబ్ ప్రస్తుతం 'కౌన్ బనేగా కరోడ్‌పతి' 18వ సీజన్‌కు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు.



# ఆ అద్భుతమైన వేడుకలో భాగం కావడం

# ఒక కల నిజమైనట్లు అనిపించింది

పలు చిత్రాల్లో నటించి ఫుల్ క్రేజ్ రాబట్టుకున్న యంగ్ బ్యూటీ అనన్య పాండే తాజాగా మరో అరుదైన బాధ్యతను అందుకున్నారు. ఇటీవల 'చాంద్ మేరా దిల్' చిత్రంతో ప్రేక్షకులను పలకరించిన ఈ భామ, రాబోయే ప్రతిష్టాత్మక ఐఐఎఫ్ఎ అవార్డ్స్ 2027 వేడుకకు సహ-హోస్ట్‌గా వ్యవహరించనున్నారు. నటిగా తనదైన అందం, అభినయంతో అభిమానులకు సంపాదించుకున్న ఆమె, ఇప్పుడు తొలిసారి యాంకర్‌గా అవార్డుల వేదికను హోస్ట్ చేస్తుండటం విశేషం. ఈ సందర్భంగా ఐఐఎఫ్ఎతో తనకున్నఅనుబంధాన్ని గుర్తుచేసుకుంటూ అనన్య ఎమోషనల్ కామెంట్స్ చేశారు. ఐఫా వేడుకలో భాగం కావడం తనకెప్పుడూ ఎంతో ప్రత్యేకమని అనన్య అన్నారు. అబుదాబిలోని యాస్ ఐలాండ్‌లో ఉన్న ప్రతిష్టాత్మక వేదికపైనే తాను మొదటిసారి స్టేజ్ పెర్ఫార్మన్స్ ఇచ్చానని, ఆ క్షణంలో కలిగిన ఉత్సాహం ఇప్పటికీ తన గుండెల్లో అలాగే ఉందని ఆమె గుర్తుచేసుకున్నారు. చిన్నప్పటి నుంచి ఐఫా అవార్డ్స్‌ను టీవీల్లో చూస్తూ పెరిగిన తనకు, భారతీయ సినిమాకు సంబంధించిన ఆ అద్భుతమైన వేడుకలో భాగం కావడం ఒక కల నిజమైనట్లు అనిపించిందని తెలిపారు. కాలక్రమేణా ఐఫా తన సినీ ప్రయాణంలో ఒక అందమైన భాగంగా మారిపోయిందని చెప్పారు. ఇలాంటి ప్రతి వేడుక ద్వారా తాను ఎంతో నేర్చుకున్నానని, కెరీర్‌లో మరింతగా ఎదగడానికి, తనలోని సరికొత్త నైపుణ్యాలను బయటపెట్టుకోవడానికి మంచి అవకాశాలు దక్కాయని అనన్య వెల్లడించారు. ఎప్పటికీ గుర్తుండిపోయే మధురమైన జ్ఞాపకాలను సొంతం చేసుకునే అవకాశం ఐఫా ద్వారానే కలిగిందని తెలిపారు. ఐఫా వేదికపై ఉండే జోష్, అక్కడి వాతావరణం, ప్రేక్షకుల అరుపులు, అలాగే మన సినిమా ఇండస్ట్రీకి చెందిన ఎంతోమంది ప్రముఖులంతా ఒకేచోట చేరి చేసే సందడిలో నిజంగానే ఒక ప్రత్యేకమైన మ్యాజిక్ ఉంటుందని ఆమె అభిప్రాయపడ్డారు. ఇప్పుడు ఏకంగా ఐఫా అవార్డ్స్‌కు సహ-హోస్ట్‌గా ఒక సరికొత్త బాధ్యతతో ఐఫా 2027 వేదికపైకి వస్తుండటం తనకెంతో సంతోషాన్నిస్తోందని అనన్య అన్నారు. మళ్లీ అదే వేదికపైకి వెళ్లి, మన దేశంలోని గొప్ప నటులు, అద్భుతమైన కథలు, విజయాలను అందరితో కలిసి వేడుకలా సెలబ్రేట్ చేసుకునే అవకాశం రావడం తనలో ఉత్సాహాన్ని నింపుతోందని చెప్పారు.



'ఉప్పెన' సినిమాతో ఇండస్ట్రీకి వచ్చి బాక్సాఫీస్‌ను షేక్ చేసి, ఓవర్ నైట్ లోనే కుర్రకారు గుండెల్లో గూడు కట్టుకున్న క్యూట్ బ్యూటీ కృతి శెట్టి. ఆ తర్వాత తెలుగు, తమిళ భాషల్లో పలు చిత్రాల్లో నటించారు. అయితే వరుస అవకాశాలు దక్కించుకున్నప్పటికీ సరైన హిట్ అందుకోలేకపోయింది. ఇక ఇటీవల విఘ్నేష్ శివన్ దర్శకత్వంలో 'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' సినిమాలో నటించిన ఈ ముద్దుగుమ్మ భారీ డిజాస్టర్‌ను చవిచూసింది. ప్రస్తుతం జయం రవి సరసన 'జీనీ' అనే భారీ చిత్రంలో నటిస్తున్నారు. ఇదిలా ఉంటే.. తాజాగా, కృతి శెట్టికి సంబంధించిన ఓ వార్త నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఈ భామ, ఇప్పుడు బాలీవుడ్‌లోకి తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నట్లు టాక్. ఒక రొమాంటిక్ లవ్ స్టోరీతో హిందీ ఇండస్ట్రీలో అడుగుపెడుతున్నట్లు తెలుస్తోంది. ఈ ప్రాజెక్ట్‌ను ప్రముఖ దర్శకుడు రోహిత్ శెట్టి వద్ద సుదీర్ఘ కాలం పాటు పని చేసిన విధి ఘోడ్గాంకర్ తెరకెక్కించనున్నారట. ఏవీఎస్ స్టూడియోస్ బ్యానర్‌పై అభిషేక్ ఎస్ వ్యాస్ దీనిని నిర్మిస్తుండగా, ఈ ఏడాదే ఈ సినిమా షూటింగ్ పట్టాలెక్కనున్నట్లు సమాచారం. చిత్రంలో కృతి శెట్టిని ఒక సరికొత్త అవతార్‌లో చూపించేందుకు మేకర్స్ ప్లాన్ చేస్తున్నారట. ఇందులో నిజమెంత అనేది తెలియనప్పటికీ ఈ విషయం తెలుసుకున్న నెటిజన్లు మాత్రం తెలుగు, తమిళంలో కలిసిరాని అదృష్టం.. బాలీవుడ్‌లో అయినా కలిసొచ్చి సరైన హిట్ పడుతుందా? లేక నిరాశనే ఎదురవుతుందా? అనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

# బాలీవుడ్‌లో తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్న బేబమ్మ..

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. RNI No : TGTEL/25/A1676, Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com